
సాక్షి
వికారాబాద్
గురువారం । 22 । మే । 2025



నేటి నుంచి ‘సప్లిమెంటరీ’

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానుండంతో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 8లో▸



సాగుకు సన్నద్ధం!

వానాకాలం పంటల సాగుకు అన్నదాతలు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నారు. 8లో▸



ఆర్టీసీ బస్సు.. ఆపేది లేదు

గతంలో ప్రయాణికులు చెయ్యి ఎత్తిన చోట ఆర్టీసీ బస్సు ఆపాలనే ఆదేశాలు ఉండేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. 9లో▸

కాగ్నా.. ఖాళీ!

యథేచ్ఛగా ఇసుక అక్రమ తరలింపు

ఇటీవల తాండూరు మండలం వీర్‌శెట్టిపల్లి శివారులోని కాగ్నా నది నుంచి అర్ధరాత్రి వేళ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని అదే గ్రామానికి చెందిన జర్నప్ప డయల్ 100కు కాల్ చేసి చెప్పాడు. అరగంట వ్యవధిలో జర్నప్ప వద్దకు అగ్గనూర్‌కు చెందిన ఓ నాయకుడు తన అనుచరులతో వచ్చాడు. పోలీసులకు సమాచారం ఇస్తావా అంటూ దాడి చేశారు. పోలీసులకు సమాచారం ఇస్తే ఇసుక వ్యాపారులు రావడంతో సదరు వ్యక్తి అవాక్కయ్యాడు. ఈ ఒక్క సంఘటన చాలు ఇసుక మాఫియాకు పోలీసులకు ఉన్న సంబంధం ఏమిటో అనేది అర్థమవుతుంది. జర్నప్ప ఒక్కడిమీదే కాదు ఇసుక అక్రమ రవాణాకు అడ్డు వచ్చే వారు ఎవరైనా దాడులకు గురికావడం నిత్యకృత్యంగా మారింది. గతేడాది ఇసుక మాఫియాకు సహకరిస్తున్నారనే ఆరోపణలతో ఎస్ఐలు, సీఐలపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. అయినా ఆ శాఖలో మార్పు కనిపించడం లేదు.

- నిత్యం 300ల ట్రాక్టర్లతో వేల ట్రిప్పులు
- రూ.లక్షల్లో వ్యాపారం
- ఫిర్యాదు చేసే వారిపై దాడులకు తెగబడుతున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న పోలీసు, రెవెన్యూ, గనుల శాఖ అధికారులు



కాగ్నా నది నుంచి ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణా

తాండూరు: నియోజకవర్గంలోని నాలుగు మండలాలను తాకుతూ కాగ్నానది ప్రవహిస్తుంది. వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. భూగర్భ జలాల పెంపునకు ఈ నది ఎంతగానో దోహదం చేస్తుంది. తాండూరు పట్టణంతోపాటు నదీ పరీవాహక ప్రాంతాల ప్రజల దాహార్తి తీరుస్తుంది. కొడంగల్ నియోజకవర్గానికి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అలాంటి కాగ్నాపై రాబందుల్లా ఇసుక వ్యాపారులు విరుచుకపడుతున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరి ఇసుక రవాణాకు అడ్డంకి లేకుండా చూసుకుంటున్నారు. రెండు నెలల క్రితం వీర్‌శెట్టిపల్లికి చెందిన జర్నప్ప ఇసుక అక్రమ రవాణాపై డయల్ 100కు ఫోన్ చేస్తే పోలీసుల ద్వారా ఆ సమాచారం ఇసుక మాఫియాకు చేరింది. సదరు వ్యక్తిపై అక్రమార్కులు దాడి చేశారు. ఈ విషయాన్ని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేస్తే నామమాత్రపు చర్యలతో సరిపెట్టారు.

అనుమతి లేకుండానే..

ఉదయం 11 గంటల ప్రాంతంలో కాగ్నానది నుంచి ఇసుక లోడ్‌తో ట్రాక్టర్లు తాండూరు పట్టణానికి రావడం కనిపించింది. నది నుంచి వరుసగా పదుల సంఖ్యలో ట్రాక్టర్లు బయటికి వచ్చాయి. అనుమతి పత్రాలు ఉన్నాయా అని ప్రశ్నిస్తే మా ఓనర్ వద్ద ఉన్నాయంటూ ట్రాక్టర్ డ్రైవర్లు సమాధానం చెప్పారు. ఇసుక తవ్వుతున్న చోట రెవెన్యూ సిబ్బంది కనిపించలేదు.

చెక్ డ్యాం పక్కనే తవ్వకాలు

తాండూరు పట్టణ శివారులో కాగ్నా నదికి సంబంధించిన చెక్‌డ్యాం ఉంది. ఇక్కడి నుంచి పట్టణానికి తాగునీరు సరఫరా అవుతుంది. చెక్ డ్యాం ద్వారా వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇక్కడి పంప్ హౌస్‌కు ఇరువైపులా ఇసుక తోడేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెక్ డ్యంకు 3 కిలో మీటర్ల వరకు ఎలాంటి తవ్వకాలు చేయరాదు. కానీ ఇసుక వ్యాపారులు ఇవేవీ పట్టించుకోవడం లేదు.

అన్ని మండలాల్లో ఇదే తంతు

తాండూరు నియోజకవర్గంలోని యాలాల, బషీరాబాద్, తాండూరు, పెద్దేముల్ మండలాల్లో ఇసుక అక్రమ రవాణ జోరుగా సాగుతోంది. ఇసుక వ్యాపారులు మాఫియాగా ఏర్పడి దందా సాగిస్తున్నారు. పెద్దేముల్ మండలం రేగొండి, రుక్మాపూర్, మంబాపూర్, మన్‌సాన్‌పల్లి, పెద్దేముల్, మంబాపూర్ గ్రామాల్లో ఇసుక రవాణాకు అడ్డూఅదపు లేకుండా పోయింది. యాలాల మండలం విశ్వనాథ్‌పూర్, కోకట్,సంగెంకుర్దు, దేవనూర్, అగ్గనూర్ గ్రామాలు.. బషీరాబాద్ మండలం ఎక్మాయి, జీవన్గి, క్యాద్గిరా, ఇందర్‌చెడ్, దామర్‌చెడ్, మంతట్టి, రెడ్డిగణపూర్, గొట్టిగకలాన్ గ్రామాలు, తాండూరు మండలంలో పాత తాండూరు, బిజ్వార్, చిట్టిగణపూర్, చంద్రవంచ, నారాయణపూర్, వీర్‌శెట్టిపల్లి గ్రామా లు ఇసుక రవాణాకు కేంద్రంగా మారాయి. తాండూరు పట్టణంలో అడుగడుగునా సీసీ కెమెరాలు ఉన్నా ఇసుక రవాణాను కట్టిడి చేయలేకపోతున్నారు.

రోజూ 300ల ట్రాక్టర్లతో..

కాగ్నానది నుంచి నిత్యం 300ల ట్రాక్టర్లతో పదుల ట్రిప్పులు ఇసుక తరలిస్తున్నారు. మరో పక్షం రోజుల్లో వానాకాలం ప్రాంభమవుతుంది. వర్షాలు పడితే ఇసుక సేకరణకు అవకాశం ఉండదు. దీంతో అక్రమార్కులు వీలైనంత వరకు ఇసుకను తోడేసి ఖాళీ స్థలాల్లో నిల్వ చేసుకుంటున్నారు. ఈ విషయం పోలీసులు, రెవెన్యూ, గనుల శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఒక టన్ను నాణ్యమైన ఇసుకకు మార్కెట్‌లో రూ.2,500 నుంచి రూ.3వేల ధర పలుకుతోంది. ట్రాక్టర్‌కు రూ.4వేల నుంచి రూ.5 వేలు తీసుకుంటున్నారు. ఈ లెక్కన ప్రతిరోజూ రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతోంది. టిప్పర్‌కు రూ.50 వేలు తీసుకుంటున్నారు.



ఎడ్ల బండిలో ఇసుక తరలింపు

రాత్రి వేళ ట్రాక్టర్ల మోత

అర్ధరాత్రి వేళ ఇసుక ట్రాక్టర్ల కారణంగా కంటిమీద కునుకు లేకుండా పోతోందని పాతతాండూరు వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత తాండూరు మీదుగా రెండు మార్గాల ద్వారా కాగ్నానదిలోకి దారి ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్ద సంఖ్యలో ట్రాక్టర్ల తిరుగుతున్నాయి. వాటి కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు తెలిపారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తే..



కాగ్నానది నుంచి రాత్రివేళ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని డయల్ 100 కు ఫోన్ చేశా. ఇసుక వ్యాపారులు ఇంటికి వచ్చి నాపై దాడి చేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశా. నామమాత్రపు చర్యలతో సరిపెట్టారు.

– జర్నప్ప, వీర్‌శెట్టిపల్లి, తాండూరు మండలం

ఆ ప్రాంతాల్లోనే తవ్వకాలు చేయాలి



కాగ్నానది పరీవాహక ప్రాంతంలో ఆరు చోట్ల ఇసుక తవ్వకాల కోసం పాయింట్లను గుర్తించాం. ఇసుక అవసరం ఉన్న వారు రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే అనుమతులు ఇస్తారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లోనే ఇసుక సేకరించాలి.

– సత్యనారాయణ, ఏడీ, గనుల శాఖ

కేసులు పెడుతున్నాం



కాగ్నానది నుంచి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటున్నాం. ఇప్పటికే పలువురిపై కేసులు నమో దు చేశాం. అనుమతి పత్రాలు ఉంటేనే ఇసుకను తరలించాలి. ఇసుక రవాణాపై సమాచారం వచ్చిన వెంటనే దాడులు చేసి వాహనాలను సీజ్ చేస్తున్నాం.

– బాలకృష్ణారెడ్డి, డీఎస్పీ, తాండూరు సబ్‌డివిజన్

న్యూస్‌రీల్

రైతులకు ఇబ్బందులు రానివ్వం

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న లింగ్యానాయక్

యాలాల: కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు బెన్నూరు, లక్ష్మీనారాయణపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా, తూకం ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. లారీల కొరత ఉందని ఈ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ వేణు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీబీ ముక్త్ అభియాన్



జిల్లా వైద్యాధికారి వెంకటరవణ

అనంతగిరి: జిల్లాలో ఈ నెల 22 నుంచి ఆగస్టు 29వ తేదీ వరకు టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్. వెంకటరవణ, జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీంద్రయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 100 రోజులు పాటు క్షేత్రస్థాయిలో టీబీ రోగులకు గుర్తించడం జరుగుతుందని తెలిపారు. ఇందుకోసం జిల్లాకు ప్రత్యేకంగా పోర్టబుల్ ఎక్స్‌రే మిషన్ వచ్చిందన్నారు. 2030 నాటికి దేశంలో టీబీని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ కృషి చేస్తోందన్నారు. టీబీని ప్రాథమిక దశలోనే గుర్తించడం, సరైన చికిత్స అందించడం, చికిత్స మధ్యలో ఆపివేయకుండా చూసుకోవడంతో వ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చన్నారు. చికిత్స పొందుతున్న రోగులకు ఆరు నెలల పాటు నెలకు వెయ్యి రూపాయల చొప్పున పోషకాహారం కోసం ఇవ్వనున్నట్లు వివరించారు.

పాఠశాల పునర్నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని పాత శిశుమందిరం పునర్నిర్మాణానికి పూర్వ విద్యార్థులు ముందుకు వస్తున్నారు. బుధవారం పాఠశాల పూర్వ విద్యార్థి చంద్రశేఖర్‌రెడ్డి తనవంతుగా రూ.10 లక్షలు అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును పాఠశాల విద్యాపీఠం ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు అభినందించారు.

ఏపీఎంపై డీఆర్‌డీఓకు ఫిర్యాదు

నందిగామ: నందిగామ మండల మహిళా సమాఖ్యలో ఏపీఎంగా పనిచేస్తున్న యాదగిరి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని సీసీ యాదయ్య జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వీర్లపల్లి సంఘంలో ఎలాంటి తీర్మానాలు లేకుండా రూ.3 లక్షలు చెక్కురూపంలో నిధులను మళ్లించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే క్లస్టర్‌లో సీసీగా పనిచేస్తున్న తనకు ఈ విషయం తెలియడంతో ఏపీఓను ప్రశ్నించగా తననే దూషించారన్నారు. ఈ విషయమై డీఆర్‌డీఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై ఏపీఎం యాదగిరిని వివరణ కోరగా.. అందులో తన ప్రమేయం లేదని, అకారణంగా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, నిజానిజాలు విచారణలో తేలుతాని స్పష్టంచేశారు.

ఇబ్రహీంపట్నం ఎస్ఐపై వేటు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎస్ఐగా పని చేస్తున్న శ్రీనివాస్‌పై వేటు పడింది. ఆయనను మల్టీజోన్ రేంజ్ ఆఫీస్‌కు సరెండర్ చేస్తూ పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 2022లో మంచాల ఎస్ఐగా విధులు నిర్వర్తించిన శ్రీనివాస్ ఓ యాక్సిడెంట్ కేసును తప్పుదోవ పట్టించారనే ఆరోపణలపై, విచారణ అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈక్రమంలో రెండు రోజుల క్రితమే ఆయన ఇబ్రహీంపట్నం పీఎస్ నుంచి రిలీవ్ అయినట్లు సమాచారం.

వికారాబాద్‌లో తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని పలు బహిరంగ ప్రదేశాల్లో బుధవారం డాగ్ స్క్వాడ్, బీడీ టీంలు తనిఖీలు చేపట్టాయి. బస్టాండ్, రైల్వే స్టేషన్లలో తనిఖీలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగానే ఈ తనిఖీలు చేపట్టినట్లు వారు తెలిపారు.

కడ్తాల్ ఎస్ఐకి ఉత్తమ పోలీసు అధికారి అవార్డు

కడ్తాల్: నేర పరిశోధన విభాగం 2024 సంవత్సరానికి సంబంధించి, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కడ్తాల్ ఎస్ఐ వరప్రసాద్ ఉత్తమ పోలీస్ అధికారిగా అవార్డు అందుకున్నారు. పీఎస్ పరిధిలో నమోదైన పలు కేసులను వేగంగా దర్యాప్తు చేయడంతో, ఉత్తమ సేవలకు గానూ బుధవారం డీజీపీ జితేందర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. బెస్ట్ ఎస్ఐ వరప్రసాద్‌తో పాటు బెస్ట్ హోంగార్డుగా అవార్డు తీసుకున్న పాండును సీఐ గంగాధర్, పోలీసులు అభినందించారు.

ప్రేమ పేరుతో మోసం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రేమ, పెళ్లి పేరుతో యువతిని మోసం చేసిన ఓ వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరువూరుకు చెందిన దుబ్బాక సాగరిక ఆదిబట్ల టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. 2022లో కోల్‌కటా టీసీఎస్‌లో పని చేసిన సమయంలో సహోద్యోగి పత్లావత్ సంజీవతో ఆమెకు పరియచం ఏర్పడింది. ప్రస్తుతం వీరిద్దరూ ఆదిబట్ల టీసీఎస్‌లో ఉద్యోగం చేస్తూ సహజీవనంలో ఉన్నారు. ఈక్రమంలో సాగరిక గర్భం దాల్చింది. దీంతో సంజీవ ఆమెకు బలవంతంగా అబార్షన్ చేయించాడు. అనంతరం పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో మొహం చాటేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఆదిబట్ల పోలీసులు, బుధవారం అతన్ని రిమాండ్‌కు తరలించారు. సాగరికకు అబార్షన్ చేసిన తుర్కయంజాల్‌లోని మహోనియా ఆస్పత్రిపై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



గేటులో చిక్కుకుపోయిన జింక



అటవీశాఖ అధికారులకు జింకను అప్పగిస్తున్న గ్రామస్తులు

జనావాసాల్లోకి వచ్చి..

గేటులో తల ఇరుక్కపోయి..

- ప్రజలకు చిక్కిన జింక
- అటవీశాఖ అధికారులకు అప్పగింత

కుల్కచర్ల: జనావాసాల్లోకి వచ్చిన ఓ జింక ప్రహరీకి ఏర్పాటు చేసిన గేటులో తల ఇరుక్కపోయి ప్రజలకు చిక్కింది. ఈ ఘటన చౌడాపూర్ మండలంలో బుధవారం చోటుచేసుకుంది. అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్మన్‌కాల్వ అటవీ ప్రాంతం నుంచి సాయంత్రం ఓ జింక మరికల్ గ్రామ సమీపంలోని రామాలయం వద్దకు వచ్చింది. అక్కడ ఓ వ్యక్తి తన స్థలానికి ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేశాడు. అందులో జింక తల పెట్టి చిక్కుకపోయింది. చూసిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని గేటుకు ఉన్న ఇనుప చువ్వలను తొలగించి జింకను బయటికి తీశారు. అనంతరం మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి పార్కుకు తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు చేశారు. జింక ఆరోగ్యంగా ఉందని బీట్ ఆఫీసర్ ఆంజనేయులు తెలిపారు.

ధాన్యం తడుస్తున్నా కొనరా?

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్

ధారూరు: అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడుస్తోందని, అయినా తూకం వేయడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ ఆరోపించారు. బుధవారం మండలంలోని గురుదొట్ల, నాగారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం మారినా అధికారుల తీరు మాత్రం మారడం లేదన్నారు. హమాలీలు, లారీల కొరత కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని సీఎం, మంత్రులు చెబుతున్నా మిల్లర్లు మాత్రం తీసుకోవడం లేదన్నారు. ప్రస్తుతం ధాన్యం తడిసి మొలకెత్తే పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. రైతుల సమస్యలపై దృష్టి సారించాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజునాయక్, నాయకులు వివేకానందరెడ్డి, ఏఈఓ సంజురాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం సేకరణపై ఏఈఓతో చర్చిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్

పనిచేసే కార్యకర్తలకే పదవులు

- పీసీసీ ఉపాధ్యక్షుడు, పరిశీలకుడు వినోద్‌రెడ్డి
- నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌రెడ్డి (చిత్రంలో) ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

పరిగి: పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకే పదవులు ఇస్తామని పీసీసీ ఉపాధ్యక్షుడు, పరిశీలకుడు వినోద్‌రెడ్డి అన్నారు. బుధవారం పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ నియోజకవర్గ స్థాయి సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అంటిపెట్టుకొని ఉన్నవారిని అధిష్టానం గుర్తిస్తుందన్నారు. పార్టీకి సేవ చేసిన వారి వివరాలు తమ వద్ద ఉన్నాయన్నారు. పార్టీ పదవుల్లో వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి కూడా సముచిత స్థానం కల్పిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని గుర్తుచేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీఆర్‌ఎస్ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువవికాసం వంటి వాటిపై ఇంటింట ప్రచారం చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిగి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. ఈ ప్రాంతానికి వేల కోట్ల రూపాయల నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ స్పోక్స్ పర్సన్ నరేందర్ యాదవ్, పీసీసీ సభ్యుడు రితిక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, పూడూరు, దోమ, చౌడాపూర్ మండలాల అధ్యక్షులు సురేందర్ ముదిరాజ్, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ధారూరు: హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ బుధవారం వికారాబాద్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ నారాయణరెడ్డి వివరించారు. ధారూరు మండలం అవుసుపల్లికి చెందిన రవి 2015లో హత్యకు గురయ్యాడు. అదే గ్రామానికి చెందిన సోమారపు సమ్మయ్య, అంతారపు శ్రీనివాసులు.. రవిని మద్యం తాగుదామని ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లి హత్య చేశారు. మృతుడి తల్లి ప్రమీలమ్మ ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ ప్రేంకుమార్ నిందితులు సమ్మయ్య, శ్రీనివాసులపై కేసు నమోదు చేశారు. సీఐ ఏవీ రంగా కేసును దర్యాప్తు చేసి ఆధారాలను న్యాయస్థానంలో సమర్పించారు. దీంతో జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి సున్నం శ్రీనివాస్ రెడ్డి నిందితులకు శిక్ష ఖరారు చేస్తూ తీర్పు ఇచ్చారని ఎస్పీ తెలిపారు. నిందితులకు శిక్ష పడేలా ఆధారాలు సేకరించిన పీపీ సుధాకర్ రెడ్డి, అప్పటి సీఐ, ఎస్ఐ రంగా, ప్రేంకుమార్‌లను, ప్రస్తుత సీఐ, ఎస్ఐలను, కోర్టు అధికారి శంకర్, వీరన్నను ఎస్పీ అభినందించారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

- సేంద్రియ సాగు లాభదాయకం
- ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సుజాత

మర్పల్లి: రైతులు సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయడంపై దృష్టి సారించాలని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సుజాత సూచించారు. బుధవారం మండలంలోని పట్లూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు అవగాహన లేక అధిక యూరియా వాడుతున్నారని తెలిపారు. దీంతో పంటల ఎదుగుదలపై ప్రభావం పడి దిగుబడి తగ్గి నష్టపోతున్నట్లు తెలిపారు. భూసారం పెంచుకునేందుకు పచ్చి రొట్ట ఎరువులు వాడాలన్నారు. అనంతరం శాస్త్రవేత్త సీ యమున రెడ్డి మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో పత్తి, జొన్న, కంది, మినుము, పెసర వంటి పంటలు సాగు చేసుకుంటే మంచిదన్నారు. రసాయన మందుల వాడకం తగ్గించి సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని సూచించారు. ఏఓ శ్రీకాంత్ మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు విధిగా బిల్లులు పొందాలన్నారు. ఒక వేళ పంట దెబ్బతింటే పరిహారం పొందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఎకోఫామ్ ఆయిల్ అండ్ ఫ్యాట్స్ కంపెనీ పీవీటీ ముఖ్య సలహాదారు రంగనాయకులు మాట్లాడుతూ.. సాగునీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ పామ్ తోటల సాగుపై దృష్టి సారించాలన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం రాయతీలు ఇస్తోందని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఎకోఫామ్ ఆయిల్ కంపెనీ సెల్ నంబర్ 8309446528కు ఫోన్ చేసి ఎఫ్ఏ శ్రీకాంత్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునిరొద్దీన్, మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్, మాజీ చైర్మన్ సురేష్, సిరిపురం వెటర్నరీ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి అక్షిత రెడ్డి, ఏఈఓలు నీరజ, ప్రశాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న శిక్షణ తరగతులు


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

దౌల్తాబాద్‌: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఎఫ్‌ఎల్‌ఎన్‌ కెపాసిటీ బిల్డింగ్‌పై శిక్షణ నిర్వహిస్తున్నారు. బుధవారం రెండో రోజు శిక్షణలో పలు విషయాలు తెలియజేశారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఆర్పీలు సాయిలు, భీమప్ప చెప్పారు. గణితం, తెలుగు సామాన్య శాస్త్రం సబ్జెక్టులపై శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్‌స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


గేదె కళేబరం

కుల్కచర్ల: విద్యుదాఘాతంతో ఓ గేదె మృతి చెందిన ఘటన చౌడాపూర్‌ మండల పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం కల్మన్‌కాల్వ గ్రామం పెద్దోళ్ల రాజేందర్‌రెడ్డికి చెందిన గేదె తన పొలంలో గాలికి తెగిపడిన విద్యుత్తు వైరుకు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. సుమారు రూ.లక్ష వరకు నష్టపోయామని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

అదుపుతప్పి కారు బోల్తా


సమీపంలో బోల్తా పడిన కారు

మొయినాబాద్‌: అతివేగంతో వెళ్లిన కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటన మొయినాబాద్‌ మండల పరిధిలోని అమ్డాపూర్‌ రోడ్డులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం జేబీఐటీ కళాశాల వైపు నుంచి శంషాబాద్‌ వైపు వెళ్తున్న క్వాలీస్‌ కారు అతివేగంతో వెళ్తూ అమ్డాపూర్‌ గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో కారులో డ్రైవర్‌ ఒక్కరే ఉన్నారు. అతనికి ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

లయన్స్‌ క్లబ్‌ సౌజన్యంతో సైకిళ్ల అందజేత


సైకిళ్లు అందజేస్తున్న మహేంద్రకుమార్‌రెడ్డి తదితరులు

కందుకూరు: లయన్స్‌ క్లబ్‌ సౌజన్యంతో దెబ్బడగూడకు చెందిన పేద విద్యార్థినులు సురక్షిత, ప్రవీణకు బుధవారం ఈ–సైకిళ్లు అందజేశారు. లయన్స్‌ క్లబ్‌ జిల్లా వైస్‌ గవర్నర్‌ జి.మహేంద్రకుమార్‌రెడ్డి చేతుల మీదుగా బాలికలకు అందించి ఒక్కో సైకిల్‌ ధర రూ.10 వేలు ఉంటుందని కోశాధికారి కె.వెంకటేశ్వర్లుగుప్తా తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ కార్యదర్శి తాళ్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వరుణుడి.. అలజడి

భారీ వర్షం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. రంగారెడ్డి, వికారాబాద్‌ జిల్లాల వ్యాప్తంగా బుధవారం ఉదయం నుంచి కురుస్తున్న వానలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు వరద దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లాయి. దీంతో దైనందిన కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. కొన్నిచోట్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆయా ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- జిల్లా వ్యాప్తంగా కుండపోత వర్షం
- జల దిగ్బంధంలో రహదారులు
- పొంగిపొర్లిన వాగులు, కాలువలు

చల్లబడిన వాతావరణం


వికారాబాద్‌లో రోడ్డుపై చేరిన వర్షపునీరు

అనంతగిరి: వికారాబాద్‌లో బుధవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తుంది. మధ్యాహ్నం వరకు ఎండ ఉండి ఒక్కసారిగా వాన పడడంతో వాతావరణం చల్ల బడింది. ఉక్కపోతతో విసిగిపోయిన ప్రజలు ఉపశమనం పొందారు.

రోడ్డుపై పారుతున్న మురుగునీరు

తాండూరు టౌన్‌: పట్టణంలో బుధవారం సాయంత్రం కురిసిన ఓ మోస్తరు వర్షానికే కొన్ని ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. పట్టణంలోని శాంతినగర్‌, సాయిపూర్‌, గ్రీన్‌సిటీ, మిత్రనగర్‌ వంటి ప్రాంతాల్లో రోడ్లపైకి మురుగునీరు చేరుకుంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరంతా రోడ్లపైనే నిలుస్తోంది. ఏటా ఇలాంటి పరిస్థితులు పునరావృతం కావడంతో పట్టణవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు మారినా మా ప్రాంత ప్రజల తలరాతలు మారవని, వార్డు అభివృద్ధికి నోచుకోదని వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు పట్టించుకుని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, సీసీ రోడ్లు వేయాలని ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు.


శాంతినగర్‌లో మురుగునీటిలోనే నడుచుకుంటూ వెళ్తున్న స్థానికులు

విరిగిన చెట్ల కొమ్మలు

మొయినాబాద్‌: అకాల వర్షం ఆగమాగం చేసింది. మొయినాబాద్‌ మున్సిపాలిటీతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. హైదరాబాద్‌–బీజాపూర్‌ జాతీయ రహదారిపై పలు చోట్ల వర్షపు నీరు నిలిచింది. మున్సిపల్‌ కేంద్రంతోపాటు అజీజ్‌నగర్‌ చౌరస్తా, హిమాయత్‌నగర్‌ చౌరస్తా, గండిపేట చౌరస్తా, కనకమామిడి గేటు సమీపంలో రోడ్డుపై వర్షం నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. బలమైన ఈదురుగాలులకు ముర్తుజాగూడలో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్‌ లైన్లపై పడ్డాయి. సుమారు నాలుగు గంటలపాటు కరెంటు సరఫరా నిలిచిపోయింది.



హిమాయత్‌నగర్‌ చౌరస్తాలో నిలిచిన వర్షపు నీరు


ఉడిపి హోటల్‌ ఎదుట వరద నీటిలో నిలిచిన వాహనాలు

❖ ఫౌంటెన్‌లా చిమ్ముతున్న నీరు

మొయినాబాద్‌రూరల్‌: అకాలంగా భారీ వర్షం బీభత్సం సృష్టించింది. రహదారులు వరద నీటితో నిండుకుండలను తలపించాయి. హైదరాబాద్‌–బీజాపూర్‌ రహదారి హిమాయత్‌నగర్‌ పరిధిలోని గండిపేట చౌరస్తా మసీదు వద్ద విద్యాజ్యోతి కళాశాల ముందు, ఎన్కెపల్లి చౌరస్తా సమీపంలో, హిమాయత్‌నగర్‌ చౌరస్తా ఉడిపి హోటల్‌ ముందు వరద నీరు భారీగా చేరడంతో వాహనాదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. హిమాయత్‌నగర్‌ చౌరస్తాలో కల్వర్టు పైపులైన్‌ పగిలి రహదారి జలమయంగా మారింది. దీంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.


పైపులైన్‌ పగిలి ఫౌంటెన్‌లా చిమ్ముతున్న నీరు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తాండూరు రూరల్‌: ఆగిఉన్న లారీని బైక్‌ ఢీ కొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కరన్‌కోట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని గౌతపూర్‌ శివారులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల పరిధిలోని చంద్రవంచ గ్రామానికి చెందిన బుర్ర దత్తు బైక్‌పై తాండూరు పట్టణానికి వస్తున్నాడు. మార్గమధ్యలో గౌతపూర్‌ శివారులో డైమండ్‌ వేబ్రిడ్జి వద్దకు రాగానే రోడ్డుపై ఆగిఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులోపడి వృద్ధురాలి మృతి

షాద్‌నగర్‌రూరల్‌: అనారోగ్యంతో ఆసుపత్రికి వెళుతున్నానని చెప్పిన వృద్ధురాలు చెరువులో శవమై తేలిన సంఘటన ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని కిషన్‌నగర్‌ గ్రామశివారులో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కిషన్‌నగర్‌ గ్రామానికి చెందిన వడ్డెఎల్లమ్మ(70) అనారోగ్యంగా ఉందని ఆసుపత్రికి వెళుతున్నానని చెప్పి ఉదయం ఇంట్లో నుంచి బయలుదేరింది. గ్రామశివారులోని చెరువులో పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వృద్ధురాలి చెప్పులు, రూ.600లు చెరువు గట్టుపైనే ఉన్నాయి. చెరువు వద్దకు స్నానానికి వెళ్లి జారిపడి మృతి చెందిందా.. లేక ఆత్మహత్య చేసుకుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సాగుకు సన్నద్ధం!

- వానాకాలం సీజన్‌కు చురుగ్గా ఏర్పాట్లు
- తొలకరి ముందే విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్న రైతులు

దౌల్తాబాద్‌: వానాకాలం పంటల సాగుకు అన్నదాతలు సమాయత్తమవుతున్నారు. మరో 15 రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉండడంతో రైతులు పంటల సాగుకు అవసరమైన పనుల్లో నిమగ్నమయ్యారు. నాలుగు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి భూములు తడవడంతో దుక్కులు దున్నడం, సేంద్రియ ఎరువులు పొలాల్లో చల్లడం వంటి పనులు చేపడుతున్నారు. వానాకాలం ప్రారంభం అవుతుందని తొలి వర్షానికే రైతులు ఎన్నో ఆశలతో పొలాలు దుక్కులు దున్నుకుంటున్నారు. యాసంగి కష్టాలను నెమరు వేసుకుంటూనే ఖరీఫ్‌ పంటలకు సన్నద్ధమవుతున్నారు అన్నదాతలు. సకాలంలో బ్యాంకులు పంట రుణాలు ఇవ్వకపోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వారిచ్చిన అప్పులతో వ్యవసాయం పనులను మొదలు పెట్టారు.

ప్రకృతి కన్నెర్ర

గత యాసంగి రైతులకు కష్టాలను మిగిల్చింది. దిగుబడులు రాక పెట్టుబడులు కూడా మిగల్లేదు. అయినా రైతులు భూమిని నమ్ముకుని సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నష్టం వచ్చిందని వ్యవసాయం చేయడం పక్కన బెట్టడం ఇష్టం లేక వానాకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. మరోపక్క వర్షాలు కురవడంతో రైతులు డివిజన్‌ పరిధిలో వ్యవసాయం పనులు మొదలుపెట్టారు. ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మండలంలో గతేడాది కంటే ఈ సారి 1200 హెక్టార్లలో వరకు సాగు విస్తీర్ణం పెరగనున్నాయి. సాగు చేయడానికి పెట్టుబడులు అవసరం రుణాల కోసం బ్యాంకుల చుట్టు తిరిగి విసిగిపోయిన రైతుల ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దిగుబడి రాక పెట్టిన పెట్టుబడులు చేతికందక రైతులు లబోదిబోమంటున్నారు. కొత్తగా అప్పులు తెచ్చి సాగు పనులు చేస్తున్నారు. ఈ సారైనా లాభాలు బాగా రావాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


నందారంలో పొలం చదును చేసిన రైతు

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్‌

కుల్కచర్ల: ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పుట్టపహాడ్‌ గ్రామానికి చెందిన హరిశ్చందర్‌ బుధవారం రాత్రి 9 గంటలకు వ్యక్తిగత పని నిమిత్తం తన బైక్‌పై మహబూబ్‌నగర్‌ వెళ్తున్నాడు. మార్గమధ్యలో గ్రామ శివారు దాటక ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట నిఘా

చేవెళ్ల: ఇంటర్‌ సప్లమెంటరీ పరీక్షలు గురువారం నుంచి జరగనున్నాయని, అన్ని కేంద్రాల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని చేవెళ్ల ఎస్‌ఐ వనం విరీష చెప్పారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. మండలంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్‌ సప్లమెంటరీ పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో హాజరై ప్రశాంతంగా పరీక్షలు రాసుకోవాలని సూచించారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్‌: అనారోగ్యంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. స్ఫూర్తి కళాశాల సమీపంలో నాదర్‌గుల్‌లో నివాసం ఉండే మడను అవినాష్‌(20) అనే యువకుడు కొన్నేళ్ల నుంచి అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


నర్సింహ (ఫైల్‌)

యాచారం: హైదరాబాద్‌ గ్రీన్‌ ఫార్మాసిటీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. పీఎస్‌ పరిధిలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన మల్కాపురం నర్సింహ(50) ఈ నెల 7న పని కోసం వెళ్తున్నానని చెప్పి ఇంటికి తిరిగి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. అయినా జాడలేదు. దీంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లిక్కి కృష్ణంరాజు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

కడ్తాల్‌: విద్యుదాఘాతంతో పాడి ఆవు మృత్యువాత పడిన సంఘటన మండల పరిధిలోని పుల్లేర్‌బోడ్‌తండాలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. తండాకు చెందిన నేనావత్‌ గోపాల్‌నాయక్‌కు ఉన్న పాడి ఆవు మేత మేసుకుంటూ పక్క పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ వద్దకు వెళ్లింది. దీంతో విద్యుత్‌ తీగకు తగలడంతో అక్కడికక్కడే మృత్యువాత పడినట్లు బాధిత రైతు తెలిపారు. ఆవు విలువ రూ.లక్ష ఉంటుందని, తనను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

ఆధునిక పద్ధతుల్లో బోధన చేపట్టాలి

సమగ్రశిక్ష ఏఎస్‌పీడీ రమేశ్‌

కొత్తూరు: మారుతున్న విద్యావ్యవస్థ, పాఠ్యాంశాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని సమగ్ర శిక్ష అసిస్టెంట్‌ ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ (ఏఎస్‌పీడీ) రమేశ్‌ సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సీఆర్పీ, ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుపై మరింత ఆసక్తి, శ్రద్ధ పెంచేందుకు ఉపాధ్యాయులు బోధనలో సాంకేతికతను వినియోగించాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారికి నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. బడిబాటలో భాగంగా బడిఈడు పిల్లను బడుల్లో చేర్పించేలా ఉపాధ్యాయులకు స్థానికులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏంఈఓ అంగూర్‌నాయక్‌, ఉపాధ్యాయులు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న రమేశ్‌

‘ఇందిరమ్మ ఇళ్ల’తో సొంతింటి కల సాకారం

షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

షాద్‌నగర్‌: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదలకు సొంతింటి కల సాకారమవుతుందని షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. బుధవారం అయన మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రమిస్తున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్‌ ఆర్థిక వ్యవస్థలను పూర్తిగా చిన్నా భిన్నం చేసిందని ఆరోపించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతూ పారదర్శకమైన పాలనను అందిస్తోందన్నారు. గత పాలకులు డబుల్‌ బెడ్రూం ఇళ్ల పేరిట ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్‌, విశ్వం, రఘునాయక్‌, చెన్నయ్య, తిరుపతిరెడ్డి, జమ్రుద్‌ఖాన్‌, శ్రావణి, ఇబ్రహీం, బస్వం, శ్రీకాంత్‌రెడ్డి, అప్పి, సత్తయ్య, ఖదీర్‌, మోహన్‌, వాసు, శివకుమార్‌, మున్సిపల్‌ కమిషనర్‌ సునీత పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

నేటి నుంచి ఇంటర్‌ ‘సప్లిమెంటరీ’

తాండూరులో నాలుగు పరీక్ష కేంద్రాలు

తాండూరు టౌన్‌: ఇంటర్మీడియెట్‌ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 29వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్‌, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్‌ పరీక్షలు జరుగనున్నాయి. ఆదివారం సైతం పరీక్ష కొనసాగనున్నది. తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, సిద్ధార్థ, సింధు బాలికల, తెలంగాణ మైనారిటీ బాలికల కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జనరల్‌ విభాగంలో ఫస్టియర్‌ 2,965 మంది, సెకండియర్‌ 952 మంది విద్యార్థులు, ఒకేషనల్‌ విభాగంలో ఫస్టియర్‌ 454 మంది, సెకండియర్‌ 292 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు కస్టోడియన్‌ కృష్ణయ్య తెలిపారు. పరీక్షల సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటుచేయనున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.


తాండూరు టౌన్‌: ఇంటర్‌ పరీక్ష కేంద్రం

ఒకే కేంద్రంలో పరీక్షలు

కొడంగల్‌ రూరల్‌: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో గురువారం నుంచి ఇంటర్‌ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్ష కేంద్రం చీఫ్‌ సూపరింటెండెంట్‌ జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న పరీక్షలకు కేంద్రం లోపలికి అరగంట ముందు అనుమతించనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ పరీక్షలకు హాజరుకావాలని చెప్పారు.

మురుగు నిలిచి.. దుర్గంధం వ్యాపించి

పెద్దేముల్‌ మండలం తట్టెపల్లి గ్రామంలో మురుగు కాల్వలు లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బీసీ కాలనీలో సీసీ రోడ్డుపై మురుగు నిలిచి దుర్గంధం వ్యాప్తిస్తోంది. దీంతో దోమలు ప్రబలి అంటువ్యాధులకు కారణమవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా చలనం కరువైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాలనీలో మురుగు కాల్వలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– తాండూరు రూరల్‌



ఎన్నికల హామీలు నెరవేర్చాలి

- ఎమ్మెల్యే సబితారెడ్డి
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

తుక్కుగూడ: కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రేవంత్‌ సర్కార్‌ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు అనేక ఉచిత హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి 18 నెలల గడుస్తున్నా ఇంతవరకు పూర్తిస్థాయిలో హామీలు నెరవేర్చలేదన్నారు. ఆడపిల్లలకు కల్యాణలక్ష్మితో పాటు, తులం బంగారం అందజేస్తామన్నారు. కానీ రాష్ట్రంలో ఇప్పటివరకు ఎవరికీ బంగారం అందలేదని గుర్తు చేశారు. కేవలం ఎన్నికల సందర్భంగా అడ్డగోలుగా వాగ్దానాలు ప్రకటించారని మండిపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ సైదులు, మున్సిపల్‌ కమిషనర్‌ వాణి, ఏఎంసీ చైర్మన్‌ కృష్ణానాయక్‌, మాజీ కౌన్సిలర్లు, ఆయా పార్టీల నాయకులు, లబ్ధిదారులు, మున్సిపల్‌, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి, అధికారులు

పచ్చిరొట్ట పైర్లతో భూసారం పెంపు

వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్త ఎస్‌జీ మహదేవప్ప

మొయినాబాద్‌: రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ఎస్‌జీ మహదేవప్ప అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. నేల ఆరోగ్యం, నీటి వినియోగం, పర్యావరణ రక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చిరొట్ట పైర్లు సాగుచేసి భూమిలో కలియదున్నడంతో భూసారం పెరుగుతుందన్నారు. ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి ఖర్చులు తగ్గించాలని.. నీటి వృథాను అరికట్టేందుకు డ్రిప్‌ ఇరిగేషన్‌, స్ప్రింక్లర్‌ విధానాలను అవలంబించాలన్నారు. పర్యావరణ రక్షణకు చెట్లను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రమేష్‌, మండల వ్యవసాయాధికారి అనురాధ, ఏఈఓ సునీల్‌కుమార్‌, సీనియర్‌ నాయకుడు నర్సింహారెడ్డి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


అజీజ్‌నగర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు